## క్లుప్తంగా

### ప్రసూతి విభాగం తనిఖీ



గర్భిణి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగాన్ని బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆ విభాగంలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే స్కానింగ్ మిషన్ల పనితీరు, వాటి రికార్డులు పరిశీలించారు. గర్భిణులకు మెరుగైన సేవలందించాలని,ఆరోగ్యపరంగా వారి సమస్యలకు తగు సూచనలు, సలహాలుఇవ్వాలని నర్సింగ్ సిబ్బందిని ఆదేశించారు.

### ముగిసిన చదరంగం పోటీలు



విజేతలకు కప్‌లు అందజేసిన దృశ్యం

**కర్నూలు (టౌన్):** నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్–17 చదరంగం పోటీలు బుధవారం సాయంత్రం ముగిసాయి. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సూపరింటెండెంట్ శేషఫణి, ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, గోవింద్, రామసుబ్బారెడ్డి, పోటీల నిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో దండు శానివ్వరెడ్డి (ప్రథమ స్థానం), హిరణ్య (రెండవ స్థానం), బాలుర విభాగంలో రిత్విక్ రాయ్ (ప్రథమ స్థానం), హిమతేజ్ (రెండవ స్థానం) విజేతలుగా నిలిచారు.

### అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్ తేజ

**కర్నూలు (టౌన్):** సచివాలయాల అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని చల్లావారీ వీధిలోని 109 సచివాలయం, మార్కెట్‌యార్డు వద్ద ఉన్న 113 సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి వచ్చే అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు.

### ఫుట్‌బాల్ విజేత 'బి.క్యాంపు '



కప్ అందుకుంటున్న బి.క్యాంపు ఫుట్‌బాల్ జట్టు

**కర్నూలు (టౌన్):** నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీల్లో విజేతగా బి.క్యాంపు బాలుర జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ పోటీ 3–1 స్కోర్‌తో రిడ్జ్ స్కూల్ జట్టుపై గెలుపొందింది. రెండు, మూడు స్థానాల్లో రిడ్జ్ జట్టు, తుంగభద్ర జట్టు నిలిచాయి. విజేతలకు వాసవీ మోటర్స్ నిర్వాహకులు శేషఫణీ శెట్టి చేతులు మీదుగా కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ రాజు, పీడీ పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### సస్పెన్షన్‌పై న్యాయ విచారణ జరిపించండి

**కర్నూలు(అర్బన్):** నంద్యాల జిల్లా అవుకు గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బీ చింతమ్మ సస్పెన్షన్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని పలువురు దళిత, బహుజన సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం మాల మహానాడు జాతీయ కార్యదర్శి మునెయ్య, బహుజన టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సతీష్‌కుమార్, ఆనంద్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శామ్యూల్ తదితరులు చింతమ్మతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడుకు వినతి పత్రం అందించారు. బయటి వ్యక్తులు చేసిన మౌఖిక తప్పుడు ఆరోపణలపై ఎలాంటి విచారణ చేయకుండా ఏకపక్షంగా చింతమ్మను సస్పెన్షన్ చేశారన్నారు. ఈ విషయంలో నంద్యాల డీఎల్‌పీఓ ఎలాంటి ప్రామాణికత లేని నివేదికల ఆధారంగా నాలుగు ఇంక్రిమెంట్లు నిలిపి వేయడమే గాక, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒంటరి మహిళను కోసిగి గ్రామ పంచాయతీకి బదిలీ చేశారన్నారు. ఆమెకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

### మలేషియా పోటీలకు ఎంపికైన కేనీషా



కర్నూలు నగరంలోని కల్లూరు ప్రాంతానికి చెందిన కేనీషా మాంటే ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతోంది. గతేడాది నవంబర్ 28వ తేదీన నిర్వహించిన జాతీయస్థాయి యోగా చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానం సాధించింది. ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో జరిగిన 47వ సబ్ జూనియర్ జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటింది. దీంతో ఈమె బెంగళూరులో జరుగనున్న పోటీలతోపాటు వచ్చే జూలై నెల 10న మలేషియా దేశంలో నిర్వహించనున్న ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించింది.

### సత్తా చాటుతున్న గురుప్రీతి



కర్నూలు నగరంలోని పాత కల్లూరుకు చెందిన గురుప్రీతి ఎడీనా పాఠశాలలో చదువుతోంది. ఆమె గతంలో జరిగిన జిల్లా యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన యోగా లీగ్ పోటీల్లో, 4వ రాష్ట్ర యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో, రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ పోటీల్లో, పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించింది. తాజాగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తోంది.

# పతకాల 'యోగ'ం

- అంతర్జాతీయ యోగా పోటీలకు ఏపీ నుంచి 9 మంది ఎంపిక
- వారందరూ జిల్లాకు చెందినవారై ఉండటం విశేషం
- ఇందులో నలుగురు కర్నూలు నగరవాసులు



యోగాసన చేస్తున్న దృశ్యం(ఫైల్)

**కర్నూలు (టౌన్):** ఒలింపిక్ క్రీడగా గుర్తించిన అనతి కాలంలోనే యోగాకు మంచి స్పందన వచ్చింది. జిల్లా కేంద్రం కర్నూలులో యోగా క్రీడాంశంలో ఎంతో మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ప్రతిభ చాటుతూ పతకాలు సాధిస్తున్నారు. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లోనూ కర్నూలు జిల్లాకు చెందిన యోగా క్రీడాకారులు ఎంపిక కావడం విశేషం. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో 1వ అంతర్జాతీయ యోగా ఫెస్టివల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 19 దేశాల నుంచి 2 వేల మంది యోగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. అర్హత సాధించిన వారంతా కర్నూలు జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ఇందులో నలుగురు కర్నూలు నగరానికే చెందిన వారు ఉండటం విశేషం.

### యోగా పోటీల్లో రాణిస్తున్న షేక్ యశ్వంత్



కర్నూలు నగరంలోని పాత కల్లూరుకు చెందిన షేక్ యశ్వంత్ మాంటే ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నాడు. గత ఏడాది జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానంలో, పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆరవ స్థానంలో నిలిచాడు. దీంతో బెంగళూరులో జరిగే అంతర్జాతీయ పోటీలతోపాటు మలేషియా దేశంలో నిర్వహించనున్న ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు.

### ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేసిన ప్రసన్న



కల్లూరు ప్రాంతానికి చెందిన ఎస్.ప్రసన్న 12 సంవత్సరాలుగా యోగా చేస్తోంది. గతేడాది బెంగళూరులోని వ్యాస విశ్వవిద్యాలయంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేసింది. 2012 నుంచి ఇప్పటి వరకు జరిగిన యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, యూనివర్సిటీ పోటీలతోపాటు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. బెంగళూరులో జరుగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

### సీఎంకు మాజీ ఎంపీ కృతజ్ఞతలు

**కర్నూలు(రాజ్‌విహార్):** శాసన మండలి స్థానాల్లో అత్యధికంగా బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాజీ ఎంపీ బుట్టా రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 18 స్థానాలు ఉండగా అందులో 14 బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించి వెనుకబడిన వర్గాల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని ఆమె పేర్కొన్నారు.

### దూదేకులకు రాజకీయ అవకాశాలు కల్పించండి

**కర్నూలు(అర్బన్):** రాష్ట్రంలో 20లక్షలకు పైగా జనాభా కలిగిన దూదేకుల సామాజిక వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమామ్‌ఖాసీం కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు ముస్లింలలో అంతర్భాగమైన దూదేకులు ఎంతో కృషి చేశారన్నారు. రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలకు 8 అసెంబ్లీ, మూడు ఎంపీ స్థానాలు కేటాయించాలని, ఇందులో నాలుగు ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలను దూదేకులకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీపీ హుసేన్‌సాబ్, కోశాధికారి డీ మదుబాయి, పీసీహెచ్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఇష్టారాజ్యం

- సీసీ కెమెరాలను ఏర్పాటు చేయని ప్రైవేటు కాలేజీలు

**కర్నూలు సిటీ:** ఇంటర్మీడియెట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కాలేజీల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం నగరంలోని ఆయా పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పాటు సాంకేతిక సమస్యల సాకుతో లవ్‌స్ట్రీమ్ కూడా ఇవ్వలేదు. మొ దటి స్పెల్ ప్రధాన సబ్జెక్టులు పూర్తి కాగా, నేడు, రేపు బ్రిడ్జ్ కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. మొదటి స్పెల్‌లో కెమెరాలు ఏర్పా టు చేయలేకపోయిన వారు ఈ నెల 26 నుంచి మొదలు కానున్న వొకేషనల్ రెండో స్పెల్ ప్రాక్టికల్ పరీక్షల నాటికై నా కెమెరాలతో పాటు లైవ్‌స్ట్రీమ్ ఏర్పాటు చేయాలని బోర్డు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కాగా 31 కేంద్రాల్లో ఉదయం జరిగిన వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 1956 మంది విద్యార్థులకుగాను, 1797 మంది హాజరయ్యారు. 159 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల కు 1638 మందికిగాను, 1569 మంది హాజరై, 69 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి తెలిపారు.

### మైనర్ డ్రైవింగ్‌పై 'స్పెషల్ డ్రైవ్'



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

క్రై కార్నర్

**కర్నూలు:** రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు నగరంలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్ ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న 22 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులను నమోదు చేసి రూ.33,770 జరిమానా విధించారు. అనంతరం వారితో పాటు తల్లిదండ్రులను కొత్తపేట దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గరకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు ఇకపై వాహనాలు అప్పగించమని తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

### పాత నేరస్తులు బైండోవర్

**కర్నూలు:** కర్నూలు పాతబస్తీలోని బాపూజీ నగర్‌కు చెందిన (పెద్ద పార్కు దగ్గర) ఇద్దరు పాత నేరస్తులు మున్నంగి కోటయ్య, గటిక సాయిచంద్‌లను మూడవ పట్టణ పోలీసులు బైండోవర్ చేశారు. వీరిపై గతంలో గంజాయి కేసులు ఉన్నాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మళ్లీ గంజాయి వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం అందడంతో ఇరువురిని బుధవారం అదుపులోకి తీసుకుని కర్నూలు తహసీల్దార్ శివరాముడు ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### కృష్ణానగర్‌లో చోరీ

**కర్నూలు:** కృష్ణానగర్‌లో చికెన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఖలీల్ ఇంట్లో చోరీ జరిగింది. ఈయన బుధవారపేటలో నివాసముంటాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి చికెన్ దుకాణానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ.50 వేలు నగదు, నాలుగున్నర తులాల బంగారు నగలు, 30 తులాల వెండి తస్కరించినట్లు బాధితుడు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

**గూడూరు రూరల్:** ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. పెంచికలపాడులో రైతులు, వ్యవసాయ సిబ్బంది, పొదుపు మహిళలతో కలిసి బుధవారం ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి పీఎండీఎస్, నవధాన్యాల సాగు, కిచెన్ గార్డెన్స్, సూర్య మండలం, విత్తన గుళికల తయారీ విధానం, బీజామృతం, విత్తన శుద్ధి విధానం, వాటి ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం గురించి, 20 నుంచి 30 రకాల విత్తనాలను వాడకం వాటి ప్రయోజనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున పాల్గొన్నారు.

### సమయం వృథా చేసుకోవద్దు

**కల్లూరు:** పరీక్షల సమయం సమీపిస్తున్నందున సమయం వృథా చేసుకోకుండా ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని డీఈఓ రంగారెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం రాత్రి నైట్ విజన్‌లో భాగంగా లక్ష్మీపురంలోని పదో తరగతి చదివే విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి రివిజన్ గురించి ఆరా తీశారు. విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రులతోనూ మాట్లాడారు. ఇంటి వద్ద కూడా సమయం కేటాయించుకుని చదువుకోవాలని సూచించారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మొబైల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని, చదువుకునే సమయంలో ఇబ్బంది లేని వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రంగమ్మ ఉన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

# 'బీజేపీతో ముస్లింలకు రక్షణ కరువు'

**కర్నూలు(సెంట్రల్):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వల్ల దేశంలోని ముస్లింలకు రక్షణ లేకుండాపోయిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ ఆరోపించారు. బుధవారం అవాజ్ నగర కమిటీ రెండో మహాసభలను బీజీ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..మొన్నటికి మొన్న రాజస్థాన్‌లో గోవు మాంసం తిన్నారని ఇద్దరు ముస్లింలను దహనం చేయడం దారుణమన్నారు. ముస్లింలు, దళితులను పశువుల కంటే హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవాజ్ కమిటీ నాయకులు ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారాల కోసం పోరాటాలకు దిగాలన్నారు. మహాసభల్లో వాహిద్ హుస్సేన్, రిటైర్డ్ ప్రొఫెసర్ మన్సూర్‌రహమాన్, హిందీ పండిట్ నిస్సార్ అహ్మద్ తమ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో అబ్దుల్ దేశాయ్, అబ్దుల్ రెహమాన్, గనిఖాన్, గౌస్ బాష, అల్లాబకాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్నూలు నగర అవాజ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బాబు ఇస్మాయిల్, అధ్యక్ష, కార్యదర్శులుగా ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, ట్రెజరర్‌గా ఇలియాస్‌లతోపాటు నలుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, 17 మంది కమిటీసభ్యులుగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

# సంక్షేమ సారథి సీఎం జగన్

- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడదాం
- ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మేయర్ బీవై రామయ్య



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

**కర్నూలు(రాజ్‌విహార్):** పేదల సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఆవిష్కరించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు పేదల కష్టాలను చూసిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వారి సంక్షేమ కోసం కృషి చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పథకాల కోసం ప్రజలు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వలంటీర్లను ఇంటింటికి పంపించి పథకాల గురించి చెప్పడంతో పాటు అర్హత ఉంటే ఇంటి వద్దే దరఖాస్తు చేయిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సులు, లేదా ఆ పార్టీ వ్యక్తులకే మంజూరు అయ్యేవన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిస్థితి మారిందని, ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. రాబోవు రోజుల్లో మరింత బాగా పనిచేసి ప్రభుత్వం చేసే మేలును ప్రజలకు వివరించాలని చెప్పారు. అనంతరం పార్టీ కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వార్డు కన్వీనర్లు, గృహ సారథులు రాబోవు రోజుల్లో మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేసిన, చేయబోయే మంచిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ అరుణ, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, నాయకులు సి.హెచ్.మద్దయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు నయీమ్ పాషా, కార్పొరేటర్లు, పార్టీ నాయకులుఆదిమోహన్‌రెడ్డి, రైల్వే ప్రసాద్, హకీం, మొయిన్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు సీ.క్యాంపు రైతుబజారు బంద్

**కర్నూలు(అగ్రికల్చర్):** క్లీనింగ్, శానిటైజ్ కార్యక్రమాల నేపథ్యంలో కర్నూలులోని సీ.క్యాంపు రైతుబజారుకు ఈ నెల 24వ తేదీన ఒక్క రోజు సెలవు ప్రకటించినట్లు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శనివారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందన్నారు.

### నిత్యావసర సరుకుల అందజేత

**కర్నూలు (టౌన్):** నగర శివారులోని అభయగిరి ఆశ్రమానికి బుధవారం మాజీ కార్పొరేటర్ సురేంద్ర నిత్యావసర సరుకులు అందజేశారు. మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని రూ.27 వేలు చెక్కు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

### క్రీడా శిక్షణ శిబిరాలకు సహకారం అందించండి

**కర్నూలు (టౌన్):** వచ్చే వేసవి సెలవుల్లో విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాలకు సహకారం అందించడంతోపాటు క్రీడా పరికరాలు సమకూర్చాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ 13 రోజుల వ్యవధిలో ఎక్కడెక్కడ శిక్షణ శిబిరాలు నిర్వహించేది వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ వ్యవస్థాపక కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

### సీహెచ్‌సీ ఏర్పాటుపై దృష్టి సారించండి

**కర్నూలు(అగ్రికల్చర్):** వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం కింద ఇంతవరకు సీహెచ్‌సీలు ఏర్పాటు కాని రైతుభరోసా కేంద్రాల్లో మార్చి నెలలో ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించా రు. రైతుమిత్ర గ్రూపుల ఏర్పాటు, బ్యాంకు ఖాతా లు ప్రారంభించడం, యంత్ర పరికరాల ఎంపిక తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. బుధవా రం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్చి నెల చివరిలోగా సీహెచ్‌సీల గ్రౌండింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రబీ పంటల నమోదు ప్రక్రియలో భాగంగా రైతులతో ఈ-కేవైసీ వంద శాతం పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్ కింద రైతుల ఈ-కేవైసీ పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏవో వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

**కర్నూలు(సెంట్రల్):** గర్భిణులు, బాలింతలు, విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రక్తహీనత నివారణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో శిశువులు, బాలికల్లో రక్తహీనత ఉంటే ఏఎన్ఎంల ద్వారా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 15 నుంచి 49 సంవత్సరాల్లోపు ఉన్న వారికి రక్తహీనత ఉంటే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యులు తగు చికిత్సలు చేయాలన్నారు. రక్తహీనత నివారణకు విటమిన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, మందులు ఇవ్వాలన్నారు. వచ్చే నెలలో మళ్లీ రక్తహీతనను రికార్డు చేసి తగ్గిందా లేదా పరిశీలించి పర్యవేక్షించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనతను నివారించి నెల ముందు ఆసుపత్రుల్లో చేర్పించి సుఖ ప్రసవాలు చేసేలా చూడాలన్నారు. ఈ విషయంలో ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ అప్పలకొండ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, ఐసీడీఎస్ పీడీ కుమారి పాల్గొన్నారు.

### వడదెబ్బ బారిన పడొద్దు

**కర్నూలు (న్యూటౌన్):** వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఎక్కువ సార్లు తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, సన్నారి, చెరుకురసం, తాటి ముంజలు, కొబ్బరినీళ్లు తీసుకోవాలని డాక్టర్ ద్వారం ప్రభాకర్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల (ఆయుష్) దత్తత గ్రామం పసుపులలో మన ఆరోగ్యం – గృహ వైద్యం, శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 52 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు.

### ఘనంగా మారెమ్మ దేవర

**కోడుమూరు రూరల్:** మండలంలోని కల్లపరి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవర ఉత్సవాలను బుధవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. దేవర ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు శ్రీమారెమ్మకు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, నైవేద్యాలను సమర్పించి తమ తమ మొక్కుబడులను భారీగా చెల్లించుకున్నారు. ఐదేళ్ల తర్వాత గ్రామంలో దేవర ఉత్సవాలు జరుగుతుండడంతో గ్రామంలోని ఏ ఇంట చూసినా వచ్చివెళ్లే అతిథులు, బంధువులతో కళకళలాడుతూ పండుగ వాతావరణం నెలకొంది.

# పోరాట యోధుడు 'ఉయ్యాలవాడ'



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

**కర్నూలు(అర్బన్):** సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించిన గొప్ప పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు.. బుధవారం స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతిని పురస్కరించుకొని ఏ క్యాంప్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1806 నవంబర్ 24న నంద్యాల జిల్లాలోని ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామంలో జన్మించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ పరిధిలోని 3వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు బెడ్ షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, కేధార్‌నాథ్, జోగి వెంకటరామిరెడ్డి, విజయమనోహర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి, చాణక్యపురి కాలనీ అసోసియేషన్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.